ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

శ్రీ చెన్నకేశవ శతకము – సామాజిక అంశాలు

భూచంద్ర

తెలుగు ఉపన్యాసకులు, కృష్ణవేణి జూనియర్ కళాశాల, జోగులాంబ గద్వాల్.

buchandra0502@gamil.com

Article Received: 06/09/2026

Article Accepted: 25/10/2026

Published Online: 29/10/2026

DOI:10.53414/Sahithyatharangini.2026.3.4.32

ఉపోద్ఘాతం:

తెలంగాణ రాష్ట్రంలోని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లానుండి జోగులాంబ గద్వాల జిల్లా నూతనంగా ఏర్పడింది. జోగులాంబ గద్వాల జిల్లాలో ఎంతోమంది సాహితీ పిపాసకులు ఉన్నారు. భాషపై, సాహిత్యంపై అభిరుచి కలిగియున్నారు. ఎంతోమంది కవులు తమ మనుసులోని భావాలను శతక పద్యాల రూపాలలో వ్యక్తపరిచారు. ఈ జిల్లానుండి చాలా శతకాలు వచ్చాయి. ఆధునిక కాలంలో పైన చెప్పిన శతకాలు జోగులాంబ శతకం, చెన్నకేశవ శతకం, మొల్దకల్రాయుని శతకం, జమ్ములమ్మ శతకం, పాగుంట వేంకటేశ్వర శతకం ఇలాగా ఇంకెన్నో శతకాలు వెలువడినాయి. వివిధ అంశాలను ఆధారం చేసుకొని కవులు వారి భావాలను ప్రాచీన పద్యాలరూపంలో రచించారు. కొందరు సామాజిక అంశాలను తీసుకుంటే కొందరు భక్తి పరంపరను, మరికొందరు జీవన విధానాన్ని పద్యరూపంలో రాశారు. అందులో నుండి వెలువడిన శతకాలలో ఒకటైన చెన్నకేశవ శతకమును గురించి తెలుసుకుందాం. ఈ శతకాన్ని రచించిన కవి ఊర ఈశ్వర్ రెడ్డి. వీరి స్వగ్రామం వడ్డేపల్లి మండలం కోవెలదిన్నె గ్రామం. వారి ప్రాంతంలో వెలసిన "చెన్నకేశవ స్వామి" గురించి ఉత్పలమాల, చంపకమాల ఛందస్సులో పద్యాలను రచించారు. ఈ శతకంలో చెన్నకేశవుడు వెలసిన స్థల ప్రాముఖ్యత, భక్తిని వివరించారు. అలాగే 105 పద్యాలతో ఎంతో రమణీయంగా రచించారు. ఒక కావ్యరచన చేయడానికి కవికి ఉండవలసిన అర్హతలను కావ్య హేతువులని ప్రాచీనులు పేర్కొన్నారు. ఈ శతకంలోని భావాలు వీరి లోకజ్ఞతకు, నిశిత పరిశీలనేక్షణకు భక్తితత్పరతకు దర్పణం పడుతున్నాయి. కవి ఇందులో తన భక్తిని ప్రకటిస్తూనే దానితోపాటు ధర్మాధర్మాలను, నీతి

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

నిజాయితీలను ఇహపరాములను, మానవధర్మాలను, తల్లిదండ్రుల సేవాఫలాన్ని, సామాజిక రుగ్మతలను, జీవహింసతోపాటు ఇంకా అనేక విషయాలను ప్రస్తావించారు. సామాజిక మార్పును కోరారు.

కవి భక్తికి ముక్తికి తన గ్రామంలో వెలసిన శ్రీ చెన్నకేశవస్వామి చరణారవిందములే శరణ్యమని తన పరిపూర్ణ భక్తితత్పరతను చాటుకున్నారు. సరళసుందరంగా, మధురంగా, శ్రీ రంగనాథుడైన చెన్నకేశవుని మహిమలను కీర్తించి ప్రార్థించారు. ఈ శతకంలో ప్రతిపద్యము సుందరము సుబోధకము పాఠకులు ఈ శతకాన్ని చదివితే ఆ మాధుర్యం తెలుస్తింది. కవి ఒక్కొక్క పద్యములో ఒక్కొక్క అంశాన్ని కళ్లముందు తిరుగాడుతున్నట్లుగా వివరించారు. అలాగే ఎక్కడా కూడా విసుగు కనిపించకుండా రచించారు. అందుకే ఈ శతకం మంచి మన్ననలను పొందింది.

శతకంలోని కొన్ని పద్యాలు అందులోని అంశాలు:

చెన్నకేశవ శతకంలో జనులు బుక్కెడు బువ్వకై మోసానికి సైతం వెనుకాడరని చెప్పాడు.

ఉ. బుక్కెడు కూటికై జనులు మోసము జేయుచు వేషధారులై
టక్కుటమార విద్యలను డాంబిక రూపము చేత జూపుచున్
రొక్కము పెక్కు లాగుచును రూఢిగ నిద్దర నుండునూహతో
నిక్కము నిన్ను గొల్వరిల నిచ్చలు చిత్రము చెన్నకేశవా! *(చెన్న కేశవ శతకం.* 43*)*

మనిషి ఆడంబరాలకు పోయి విద్యయెక్క పరమార్థాన్ని గ్రహించలేడన్నారు. అలాగే రూపాన్ని చూసి మురిసిపోతారు కానీ నీవే శాశ్వతమని తెలియక భ్రమలో ఉన్నారంటున్నాడు కవి.

అదేవిధంగా కవి ఈ శతకంలో మనసు చంచలమైనదంటాడు. చక్కగా ఒకే చోట నిలవదని ఈ విధంగా చెప్పాడు.

ఉ. చంచలమైనదీమనము చక్కగనుండదిదొక్కచోట జూ
పించిన నీదు తేజమును ప్రేమగ జూచుచునుండునేమొ నా
సంచితమేము నేనెరుగ సందియమున్నదిదీర్చినన్ పట
పంచలు గాదె మాయ చను ప్రజ్ఞ నొసంగవె చెన్నకేశవా! *(చెన్న కేశవ శతకం.* 91*)*

కవి నీరూపాన్ని ప్రేమగా చూచిన మనసుకెంతో సంతోషం కలుగుతుంది. అలాగే నామనసులో సందేహమును దీర్చి నాలో ఉన్న అజ్ఞానాన్ని తొలగించమని అన్నాడు. కవి లోతైన విషయాలను సైతం సరళంగా అర్థంచేసుకునే పద్ధతిలో పద్యాలను రచించాడు.

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

మరొక సందర్భంలో ధనం శాశ్వతం కాదని అన్నాడు. ఈ సృష్టిలో శాశ్వతంగా ధర్మమే నిలుస్తుందని చెప్పాడు.

చం. ధనమది వెంటరాదు తన ధర్మమె పృథ్విని శాశ్వతమ్ముగా
తనమన భావనల్ మదిన దల్చక సర్వము నొక్కడే యనన్
మనమున దల్చుచున్ హరిని తన్మయతన్ననుభూతి పొందగా
వనమునననున్న ముక్తి నిజ వైభవ మంబదె చెన్నకేశవా! *(చెన్న కేశవ శతకం. 2)*

అశాశ్వతములయిన ధనంపైనే మనిషి బ్రతుకు నావ సాగుతుంది. అంతేకానీ శాశ్వతమైన ధర్మమును మరుస్తున్నాడు. హరినామస్మరణ మనసున జేసిన చాలు జీవితానికి ముక్తి లభిస్తుందని కవి భావన.

తల్లిదండ్రులు లేనప్పుడు మనము ఎక్కడి వారమన్నాడు. అందుకే జన్మనిచ్చిన అమ్మానాన్నను సేవించి పూజించాలన్నాడు. కనిపించని దేవుని ప్రతిరూపమే మనం చూస్తున్న మన తల్లి దండ్రులన్నాడు.

ఉ. తక్కిన మాటలేటికిక తల్లియు దండ్రియు లేక లేముగా
చక్కని జన్మనిచ్చి మరి సత్యము ధర్మము నీతిమార్గముస్
మక్కువ తోడ దెల్పి మహి మాన్యుల జేసిన పూజ్యనీయులస్
మ్రొక్కిన చాలదే శిలల మ్రొక్కగనేటికి చెన్నకేశవా! *(చెన్న కేశవ శతకం. 9)*

పై పద్యం ద్వారా తల్లిదండ్రులు మనకు నీతి మార్గాన్ని బోధిస్తారన్నాడు. ఇష్టంతో అమ్మా నాన్నల పూజ చేసిన దైవపూజతో సమానమన్నాడు. లోకంలో తల్లిదండ్రులను మించిన దైవం లేరుకదా అని చెప్పాడు.

కురుక్షేత్ర సంగ్రామంలో శ్రీకృష్ణుడు పార్థునకు సారధిగా నిలిచాడు. అలాగే ధర్మం పక్షాన నిలబడి ధర్మాన్ని గెలిపించాడు. ఎంతమంది సైన్యం అధర్మం పక్షాన ఉన్నాకాని. చివరికి గెలిచేది ధర్మమేనని చెప్పాడు. అలాగే కవి కలియుగ జీవితంలో తన జీవితానికి సారథికమ్మని చెప్పాడు.

చం. తరగని భక్తి శ్రద్ధలను దైవిక చర్చలయందు రక్తియున్
పరమును జేరు మార్గమును బాహ్యమునందు విరక్తి గల్గగన్
స్థిరమగు చిత్తవృత్తులను చిత్తమునందున జేరవీయకన్
ధర నిను గొల్వ ముక్తినిది ధన్యుని జేయవె చెన్నకేశవా! *(చెన్న కేశవ శతకం. 41)*

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

మనసుకు కలిగే చిత్తవృత్తులను దూరం చేసి చిత్తము నీవే నిల్వాలన్నాడు. నేలపై నిన్నుకొలిచే వాడికి ఎప్పటికైనా నీ అనుగ్రహం లభిస్తుంది అన్నాడు. దానివల్ల జీవితానికి కావలసిన పరమ ముక్తిమార్గం కూడా లభిస్తుంది అంటున్నాడు కవి.

ఇది కలియుగమని ధర్మంపై అధర్మం పోరాడి జనులను మార్చేస్తుంది అన్నాడు. దైవాంశ విషయాలకు స్థానం ఇవ్వకుండా అసుర గుణాలతో ఈర్ష్య ద్వేషాలు, పగప్రతీకారంతో జనులు వ్యవహరిస్తారు అని కవి తన ఆవేదనను ఈ శతకములో తెలిపాడు.

చం. కలియుగ ధర్మమో నలువ ఘంటమునందుదయించు వ్రాతయో
మలినమనస్కులై ప్రజల మానము ప్రాణము తీయునట్టి యా
తులువల ఘోరకృత్యముల ద్రుంచగ నీ భువినుద్భవించి యీ
కలుషమడంచి మాన్యులను గావవె శీఘ్రమె చెన్నకేశవా! *(చెన్న కేశవ శతకం. 47)*

మలినమైన మనసుతో జనుల ప్రాణాలను తీయడానికి వెనకాడరన్నాడు. తులువ చేష్టలతో ఘోరమైన కార్యాలు చేస్తారంటాడు కవి. అందుకే ఈ మనుష్యుల మనుసులో ఉన్న కలుషిత గుణాన్ని త్రుంచి గొప్పవారిగా మార్చు చెన్నకేశవా! అన్నాడు.

ఊర ఈశ్వరరెడ్డి చెన్నకేశవ శతకం ద్వారా అనేక అంశాలను కళ్ళకు కట్టినట్లుగా మనకు తెలియజేశాడు.

ముగింపు:

"శ్రీ చెన్నకేశవ శతకం" సుందర సుమధుర శతకం. కవి సమాజంలోని మానవ జీవన విధానం గురించి, అలాగే భగవంతుడు, తల్లిదండ్రుల సేవాగుణాన్ని చెప్పాడు. నిజ జీవితంలో కృష్ణుడినే సారధిగా రమ్మని కోరడం కలియుగంలో చాలా అద్భుత విషయం. ఈ శతకం ఉత్పలమాల, చంపకమాల ఛందస్సులో చక్కని పదజాలం. చదివిన వారికి మనుసులో ఏంతో ఉల్లాసాన్ని కల్గిస్తుంది. దాంతో పాటుగా జీవిత సార్ధకతను తెలుపుతుంది. ఈనాటి ఆధునిక కాలంలో కూడా ఇలాంటి శతకాలు సమాజాన్ని మేల్కొల్పడం నిజంగా అభినందించదగ్గ విషయం. అందరూ కూడా ఈ శతకాన్ని చదివి దీనిలోని నీతిసారాన్ని గ్రహించి జీవితాల్లో ఆచరించాలని ఈ శతకం ద్వారా తెలియజేస్తున్నాడు.

ఆధార గ్రంథాలు

ఈశ్వర రెడ్డి, ఊర. (2021). చెన్నకేశవ శతకము. కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్.